నూతన కార్మిక సంఘం కార్యవర్గాన్ని అభినందిస్తున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు

క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలి

సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు

సిద్దిపేట, జనవరి 25: క్రీడాకారులు క్రీడాస్ఫూర్తి చాటాలని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నంగునూర్ మండలంలో టీహెచ్ఆర్‌టీం, ఎన్‌సీసీ క్రికెట్ టీంల మధ్య జరిగిన పోటీలో గెలుపొందిన ముండ్రాయి జట్టుకు గురువారం ట్రోఫీ అందజేశారు. పట్టణంలోని లింగారెడ్డిపల్లి మాజీ ఎంపీటీసీ కదుర్ల బాల్లయ్య తల్లి, 23 వార్డు కౌన్సిలర్ లక్ష్మణ్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. బాధిత కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే పరామర్శించారు. ఇటీవల నూతనంగా ఎన్నికైన మిట్టపల్లి ఆర్చ్ ఫార్మా కంపెనీ నూతన కార్మిక సంఘం కార్యవర్గాన్ని అభిందించారు.

క్యాలెండర్ ఆవిష్కరణ..

సిద్దిపేట, జనవరి 25: జిల్లా వీరశైవ లింగాయత్ సమాజం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు క్యాంప్ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, మున్సిపల్ వైస్ చైర్మన్ కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పాలకవర్గం..

దుబ్బాక టౌన్, జనవరి 25 : మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావును సిద్దిపేటలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం చైర్‌పర్సన్ గన్నె వనితాభూంరెడ్డి ఆధ్వర్యంలో పలువురు కౌన్సిలర్లు కలిశారు. ఈ సందర్భంగా దుబ్బాక మున్సిపాలిటీలో జరుగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. ప్రస్తుత రాజకీయాలపై సమీక్షించారు. అనంతరం వైస్ చైర్‌పర్సన్ సుగుణాబాలకిషన్‌గౌడ్ కుమారుడి పెండ్లిపత్రికను ఎమ్మెల్యే హరీశ్‌రావుకు అందజేసి ఆహ్వానించారు. కౌన్సిలర్లు ఆస యాదగిరి, మూర్తి సంధ్యారాణి శ్రీనివాస్‌రెడ్డి, దేవలక్ష్మీసంజీవరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు అధికం బాలకిషన్‌గౌడ్, బట్టు ఎల్లం, గన్నె భూంరెడ్డి, పులిగారి ఎల్లం ఉన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్

సిద్దిపేట, జనవరి 25: వరంగల్-ఖమ్మం, నల్గొండ జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గాలకు సంబంధించి త్వరలో ఎమ్మెల్సీ ఎన్నికలు జరుగనున్నాయి. ఆ పరిధిలోకి వచ్చే కొమురవెల్లి, చేర్యాల, దూళిమిట్ట మండలాలకు చెందిన పట్టభద్రులు ఫామ్-18 ద్వారా ఆయా మండలాల తహసీల్ కార్యాలయాల్లో ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్ కోరారు. ఓటు హక్కు నమోదుకు ఫిబ్రవరి 6 వరకు అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఫామ్-18కు డిగ్రీ మెమో, ఓటర్ గుర్తింపు కార్డుతోపాటు నివాస ధ్రువీకరణ పత్రాలను జత చేయాలని కలెక్టర్ సూచించారు.

ఓటు ప్రజాస్వామ్యానికి పునాది

ఓటు ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్, అధికారులు

సిద్దిపేట, జనవరి 25: ప్రజాస్వామ్యానికి ఓటు పునాది అని, ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతిఒక్కరూ ఓటు వేయాలని అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. జాతీయ ఓటరు దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని కొండా భూదేవి గార్డెన్స్‌లో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన అదనపు కలెక్టర్ ఓటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. నూతన ఓటర్లకు ఎపిక్ కార్డులను పంపిణీ చేశారు. సీనియర్ సిటిజన్స్‌ను సన్మానించారు. శాసనసభ ఎన్నికల శిక్షణలో పాలుపంచుకున్న జిల్లాస్థాయి మాస్టర్ ట్రైనర్స్‌కు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే శక్తి ఓటుకే ఉన్నదన్నారు. ఎన్నికల సీఈవో నుంచి బూత్ లెవెల్ అధికారులు, అంగన్వాడీలు ఇలా ప్రతి ఒక్కరూ ఎన్నికల విధులను నిష్పక్షపాతంగా నిర్వహిస్తారని తెలిపారు. కార్యక్రమంలో సిద్దిపేట ఆర్డీఓ రమేశ్‌బాబు, సిద్దిపేట అర్బన్ తహసీల్దార్ దిలీప్‌కుమార్, సిద్దిపేట మున్సిపల్ కమిషనర్ సంపత్‌కుమార్, బీఎల్‌వోలు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

శాంతిభద్రతల పరిరక్షణే ధ్యేయం

సిద్దిపేట సీపీ డాక్టర్ అనురాధ

మాట్లాడుతున్న సీపీ డాక్టర్ అనురాధ

సిద్దిపేటరూరల్, జనవరి 25: జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే ప్రధాన కర్తవ్యమని సిద్దిపేట సీపీ డాక్టర్ బి.అనురాధ అన్నారు. సిద్దిపేట పోలీస్ కమిషనరేట్‌లో గురువారం మీడియా సమావేశం నిర్వహించారు. చట్టాన్ని ఎవరూ చేతుల్లోకి తీసుకోరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజలకు పోలీసులు ఎల్లవేళలా అందుబాటులో ఉంటారన్నారు. ఎలాంటి ఫిర్యాదు ఉన్నా తక్షణమే స్పందిస్తామని తెలిపారు. డ్రగ్ ఫ్రీ కమిషనరేట్‌గా మార్చేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. కమిషనరేట్ పరిధిలో ప్రమాదాల సంఖ్య పెరిగిందని, నియంత్రణకు తగిన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తామని తెలిపారు. గంజాయి, మత్తు పదార్థాలు, పేకాట, జూదం వాటిపై నిఘా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పీడీఎస్ బియ్యం అక్రమ రవాణా, ఇసుక అక్రమ రవాణాపై నిఘా ఏర్పాటు చేసి నియంత్రిస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణం అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వల్లే జరుగుతున్నాయన్నారు. జిల్లా పరిధిలో బ్లాక్ స్పాట్లను గుర్తించామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు నివారించేందుకు సంబంధిత శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటామన్నారు. బైక్ నడిపేటప్పుడు హెల్మెట్ ధరించాలని, కారు నడిపేప్పుడు సీటు బెల్టు ధరించాలని, ట్రాఫిక్ రూల్స్ పాటించి పోలీసుశాఖకు సహకరించాలని కోరారు.

బ్యాంకు సేవలు సద్వినియోగం చేసుకోవాలి

మాట్లాడుతున్న ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్

కొమురవెల్లి, జనవరి 25: బ్యాంకు సేవలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్ అన్నారు. గురువారం కొమురవెల్లి మండల కేంద్రంలో ఏపీజీవీబీ బ్రాంచ్‌ను నూతన భవనంలోకి మార్చారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ చాలామంది ఖాతాదారులు కేవలం క్రాప్‌లోన్, డ్వాక్రా లోన్ మాత్రమే తీసుకుంటున్నారన్నారు. మా బ్యాంకులో అన్ని రకాల రుణ సౌకర్యాలు ఉన్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమకు తొచినంత డబ్బులు బ్యాంకులో దాచుకోవాలని, అత్యవసరమైనప్పుడు ఎవరికీ చేయి చాపాల్సిన అవసరం ఉండదన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సిలువేరు సిద్దప్ప, మల్లన్న ఆలయ పునరుద్ధరణ కమిటీ చైర్మన్ పర్పటకం లక్ష్మారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు భిక్షపతి, అడ్మిన్ శ్రీనివాస్, బిజినెస్ మేనేజర్ రజాక్‌పాషా, బ్యాంకు మేనేజర్ మల్లేశం, ఫీల్డ్ ఆఫీసర్ మహేందర్, ఏపీఎం, వీవోఏలు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడాకారులను ప్రోత్సహించాలి

మద్దూరు(ధూళిమిట్ట), జనవరి 25: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రభుత్వం ప్రోత్సహించాలని బీఆర్ఎస్ మద్దూరు మండల అధ్యక్షుడు మేక సంతోశ్‌కుమార్ కోరారు. గురువారం మద్దూరు మండలంలోని గాగిళ్లాపూర్‌లో డివిజన్ స్థాయి క్రికెట్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరయ్యారు. క్రికెట్ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన మద్దూరు జట్టుకు రూ.15వేలు, ద్వితీయ స్థానంలో నిలిచిన గాగిళ్లాపూర్ జట్టుకు రూ.10వేల ప్రైజ్‌మనీని ఆయా జట్ల క్రీడాకారులకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ బొల్లు కృష్ణవేణిచంద్రమౌళి, ఉపసర్పంచ్ మేక మాధవీగోపాల్, యూత్ నాయకుడు భూర్గు రాజు తదితరులు పాల్గొన్నారు.

దుబ్బాక అభివృద్ధే లక్ష్యం

ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, జనవరి 25: దుబ్బాక నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గురువారం రాత్రి దుబ్బాక మండలం గోసాన్‌పల్లి, చీకోడు గ్రామాల్లో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలలో పాల్గొన్నారు. గోసాన్‌పల్లిలో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, చీకోడులో రూ.20 లక్షలతో గ్రామ పంచాయతీ భవనం, రూ.35 లక్షలతో మన ఊరు-మన బడి పథకంలో రూ. 35లక్షలతో పాఠశాల తరగతి గది, ప్రహరీ, రూ.20లక్షలతో ప్రాథమిక ఆరోగ్య ఉపకేంద్ర భవనం, రూ.10 లక్షలతో రజక సంఘం భవనాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేసీఆర్ సర్కారు హయాంలోనే గ్రామాలకు మహర్దశ వచ్చిందన్నారు. మారుమూల గ్రామాలు పంచాయతీలుగా మారాయన్నారు. కార్యక్రమంలో ఎస్సీఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, జడ్పీటీసీ రవీందర్‌రెడ్డి, ఏఎంసీ చైర్‌పర్సన్ జ్యోతికృష్ణ, సర్పంచులు శ్రీనివాస్, లక్ష్మి, ఎంపీటీసీలు లక్ష్మీనారాగౌడ్, రాంరెడ్డి, కోఆప్షన్ మెంబర్ ఇస్మాయిల్, నాయకులు కిషన్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

గోసాన్‌పల్లిలో పంచాయతీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

రఘునందన్‌రావుకు మతిభ్రమించింది

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి, పక్కన కౌన్సిర్లు, బీఆర్ఎస్ నాయకులు

దుబ్బాక, జనవరి 25: బీజేపీ నేత రఘునందన్‌రావు మతిభ్రమించి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ గన్నే నవితాభూంరెడ్డి మండిపడ్డారు. మూడేండ్లు దుబ్బాక ఎమ్మెల్యేగా ఉన్న రఘునందన్‌రావు ఒక్క రూపాయి పని చేయలేదని ఆరోపించారు. మాటలతో కాలంగడుపుతూ కోతలరాయుడిగా తయారయ్యాడని వ్యాఖ్యానించారు. గురువారం దుబ్బాక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. రఘునందన్‌రావు బుధవారం ప్రెస్‌మీట్‌లో ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డిని విమర్శిస్తూ మున్సిపల్ నిధుల గురించి చేసిన వ్యాఖ్యలను ఖండించారు. రఘునందర్‌రావుకు ప్రజల సమస్యలు పట్టవని, ప్రస్తుత ఎమ్మెల్యే, అప్పటి ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి సహకారంతోనే దుబ్బాకకు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. అభివృద్ధిలో భాగంగా ఆయన సీఎం, మంత్రులను కలుస్తున్నారని చెప్పారు. దీనిని రాజకీయం చేయడం సరికాదన్నారు. ఎమ్మెల్యే ప్రభాకర్‌రెడ్డిని విమర్శించే నైతిక హక్కు రఘునందన్‌కు లేదన్నారు. బీజేపీ కౌన్సిలర్(దుబ్బాక 9వ వార్డు కౌన్సిలర్) మట్టా మల్లారెడ్డికి అన్యాయం జరిగిందని మాట్లాడటం హాస్యాస్పదంగా ఉన్నదన్నారు. మల్లారెడ్డి ఇటీవల చెల్లాపూర్‌కు కాంగ్రెస్ నాయకుడు మైనంపల్లి హన్మంతరావును ఎందుకు తీసుకొచ్చాడని ప్రశ్నించారు. పైసల కోసం పార్టీ మారే మీరు బీఆర్ఎస్ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. గత ఎన్నికల్లో మీ వైఖరి నచ్చకనే దుబ్బాక ప్రజలు ఓటుతో ఛీ కొట్టారని చెప్పారు. నియోజకవర్గంలోని 256 పోలింగ్ కేంద్రాల్లో ఒక్కచోట కూడా మెజార్టీ సాధించలేకపోయారని ఎద్దేవా చేశారు. మీ సొంత గ్రామం బొప్పాపూర్‌లో మీకు ఎన్ని ఓట్లు వచ్చాయో గుర్తు చేసుకోవాలన్నారు. ఇకముందు ఎమ్మెల్యే ప్రభాకరన్న, బీఆర్ఎస్‌ను విమర్శిస్తే సహించబోమన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు యాదగిరి, దేవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు రాజమౌళి, బాలకిషన్‌గౌడ్, ఎల్లారెడ్డి, మూర్తి శ్రీనివాస్‌రెడ్డి, భూంరెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఒకే రోజు నాలుగు ఆలయాల్లో చోరీ

మర్కూక్, జనవరి 25: ఒకేరోజు మర్కూక్‌లోని నాలుగు ఆలయాల్లో దుండగులు చోరీకి పాల్పడ్డారు. మర్కూక్ ఎస్సై శంకర్ కథనం ప్రకారం.. మర్కూక్ మండల కేంద్రంలో బుధవారం రాత్రి మహంకాళి గుడి తాళం పగులకొట్టి అందు లో ఉన్న హుండీ, సీసీ కెమెరాలకు సంబంధించిన డీవీఆర్‌ను ఎత్తుకెళ్లారు. పెద్దమ్మతల్లి గుడి తాళాలను పగలకొట్టి హుండీలోని డబ్బులు, చిన్న వెండి తొట్టెలు, ఎల్లమ్మ గుడిలో హుండీ డబ్బులు, చిన్న మంగళసూత్రాన్ని ఎత్తుకెళ్లారు. ముత్యాలమ్మ గుడి తాళాలు పగలకొట్టి అందులో ఎలాంటి వస్తువులను దొంగిలించలేదు అని గ్రామస్తులు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు మంత్రి కోమటిరెడ్డి క్షమాపణ చెప్పాలి

దుబ్బాక మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి

మాట్లాడుతున్న రైతుమిత్ర సంఘాల అధ్యక్షుడు ఆలేటి మాధవరెడ్డి

హుస్నాబాద్‌టౌన్, జనవరి 25: రైతు బంధు విషయంపై నోటిదురుసుగా వ్యవహరించిన మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని రైతుమిత్ర సంఘాల పరస్పర సహకార సంఘం అధ్యక్షుడు ఆలేటి మాధవరెడ్డి డిమాండ్ చేశారు. హుస్నాబాద్‌లో గురువారం విలేకరులతో మాట్లాడుతూ రైతుబంధు అడిగితే మంత్రి చెప్పుతో కొడుతానని అహంకారపూరితంగా మాట్లాడం సరికాదన్నారు. ప్రజలను రెచ్చగొట్టి, మభ్యపెట్టి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. మంత్రి మర్యాదను కోల్పోయి, అమానుషంగా మాట్లాడం సరైందికాదని, తీరు మార్చుకోవాలని హితవు పలికారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ప్రజలు తప్పక బుద్ధి చెబుతారన్నారు. రైతులు తిరగబడే సమయం వస్తుందనే విషయాన్ని మంత్రి కోమటిరెడ్డి గుర్తుంచుకోవాలన్నారు. రైతు మిత్ర సంఘాల నాయకులు సీహెచ్ స్వామిరావు, ఎం.మాధవరెడ్డి, వీరయ్య ఉన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న అధికారులు

భూసేకరణను అడ్డుకున్న గ్రామస్తులు

సిద్దిపేట రూరల్, జనవరి 25 : సిరిసిల్ల నుంచి సూర్యాపేట వరకు నిర్మించనున్న జాతీయ రహదారి బైపాస్ రోడ్డుకు సిద్దిపేట రూరల్ మండలంలోని చిన్నగుండవెల్లిలో భూసేకరణ చేపట్టాల్సి ఉంది. గురువారం గ్రామానికి సంబంధిత అధికారులు వెళ్లగా గ్రామస్తులు అడ్డుకున్నారు. భూసేకరణపై పలు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. అనంతరం గ్రామస్తులతో పంచాయతీ కార్యాలయంలో సమావేశమయ్యారు. ఆర్డీవో, సిద్దిపేట రూరల్ తహసీల్దార్ సలీం గ్రామస్తులతో మాట్లాడారు. జాతీయ రహదారి పనులకు సహకరించాలని గ్రామస్తులను అధికారులు కోరారు. సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు, రైతులు కోరగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు.

రోడ్డు భద్రత మనందరి బాధ్యత

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న రవాణాశాఖ అధికారి లక్ష్మణ్

సిద్దిపేట టౌన్, జనవరి 25: రోడ్డు భద్రత అందరి బాధ్యత అని సిద్దిపేట జిల్లా ఇన్‌చార్జి రవాణా శాఖ అధికారి లక్ష్మణ్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలను పురస్కరించుకొని రవాణా శాఖ కార్యాలయంలో గురువారం ట్రాఫిక్ నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించాలన్నారు. లైసెన్స్ లేకుండా వాహనం నడుపవద్దన్నారు. బైక్ నడిపే సమయంలో విధిగా హెల్మెట్, కారు నడిపేటప్పుడు సీటుబెల్టు ధరించాలని సూచించారు. మద్యం సేవించి వాహనం నడుపవద్దన్నారు. రాంగ్ రూట్లో వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో డ్రైవర్ గుండెపోటుకు గురైతే సీపీఆర్ చేసి ఏ విధంగా రక్షించాలో వైద్య సిబ్బంది వాహనాదారులకు చేసి చూపించారు. కార్యక్రమంలో ఎంవీఐ కవిత, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి

చేర్యాల : పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

చేర్యాల, జనవరి 25 : మండలంలోని ఆకునూరు గ్రామంలోని డబుల్ బెడ్రూం ఇండ్లకు తాగునీటిని సరఫరా చేయాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు అందె అశోక్ కోరారు. గురువారం కాలనీ వాసులతో కలిసి పంచాయతీ కార్యదర్శి బాలయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ డబుల్ బెడ్రూం ఇండ్లలో నివాసముంటున్న ప్రజలకు కొద్దిరోజులగా మిషన్ భగీరథ నీరు రాకపోవడంతో బోరుబావుల నుంచి నీరు తెచ్చుకుంటున్నారని తెలిపారు. కాలనీవాసుల సమస్యను పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. చంద్రకళ, సౌజన్య, కళావతి, పోచవ్వ, సుశీల, నిర్మల, పద్మ, రమ, జ్యోతి, శారద, జరీనా, కనకయ్య, యాదగిరి పాల్గొన్నారు.

తాగు నీటి సమస్య పరిష్కరించాలి

మున్సిపాలిటీలోని 2వ వార్డులో 20 రోజులగా తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, దీంతో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం పట్టణ నాయకుడు శ్రీహరి అన్నారు. సీపీఎం పట్టణ కమిటీ సభ్యులు వార్డు లో పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శ్రీహరి మాట్లాడుతూ డ్రైనేజీ సమస్య, చెత్తాచెదారంతో వార్డు కంపు కొడుతున్నదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు అరుణ్, ప్రభాకర్, భాస్కర్, మల్లేశం, రంజిత్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక స్థలాలు అమ్మడం నేరం

చేర్యాల, జనవరి 25: పట్టణంలోని ఇండియా మిషన్ ఆస్తుల క్రయ విక్రయాలు జరిపితే నేరం అవుతుందని ఇంటర్నేషనల్ మిషన్ ఇండియా ఫెలోషిప్ ఆఫ్ ఇవంజలికల్ చర్చస్ ప్రతినిధులు అన్నారు. గురువారం పట్టణంలో విలేకరులతో ఆ సంస్థ ప్రతినిధులు మాట్లాడారు. పట్టణంలోని మిషన్ కాంపౌండ్ స్థలంపై గోపిజోనా, అగ్రిప్పా అనే వ్యక్తులు అక్రమంగా నకిలీ పత్రాలు సృష్టించి అమ్ముతున్నారని తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. సదరు కాంపౌండ్ సుమారు 90 ఏండ్ల క్రితం ఏర్పడి ఈ ప్రాంత ప్రజలకు వైద్య, విద్యను అందిస్తూ ఆధ్యాత్మికంగా విలసిల్లుతున్నదన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాలకు కేంద్ర బిందువుగాఉన్న స్థలాన్ని అమ్మడానికి, కొనడానికి వీలులేదన్నారు. ఎవరైనా యత్నిస్తే వారిపై చర్యలు తప్పవన్నారు. సమావేశంలో రెవ శామ్యుల్, ఇస్సాక్, టి.డేవిడ్, ప్రణబ్‌కుమార్, జాషువా, జీవరత్నం, పౌలు, జాన్సన్, బాబు, ప్రభాకర్, ప్రసాద్, కుమార్, శీను, దేవదాస్, ఇంద్రసేనారెడ్డి పాల్గొన్నారు.

భారత్ ఫిల్లింగ్ స్టేషన్ ప్రారంభం

కోహెడ, జనవరి 25: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన భారత్ ఫిల్లింగ్ స్టేషన్‌ను గురువారం ఎంపీపీ కీర్తి ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకుడు దేవిశెట్టి శ్రీనివాస్‌రావు, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి కర్ర శ్రీహరి, మండల అధ్యక్షుడు ఆవుల మహేందర్, ఏఎంసీ చైర్మన్ తిప్పారపు జ్యోతి, ఎంపీటీసీ ఖమ్మం స్వరూప, నాయకులు కొక్కుల సురేశ్, తిప్పారపు శ్రీకాంత్, పేర్యాల రాజేశ్వర్‌రావు గుగ్గిల్ల శ్రీనివాస్, వెంకటేశం పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించాలి

కొమురవెల్లి, జనవరి 25: ద్విచక్ర వాహనదారులు విధిగా హెల్మెట్ ధరించాలని కొమురవెల్లి ఎస్సై నాగరాజు అన్నారు. రోడ్డు భద్రతా ఉత్సవాల్లో భాగంగా గురువారం కొమురవెల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో హెల్మెట్ ధరించని వారికి విన్నూత రీతిలో పూలు ఇచ్చి అవగాహన కల్పించారు. హెల్మట్ ప్రాధాన్యతను వివరించి ఇకపై హెల్మెట్ ధరిస్తామని వారి నుంచి హామీ తీసుకున్నారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పాడి పరిశ్రమాభివృద్ధే ధ్యేయం

వర్గల్, జనవరి 25: తెలంగాణ వచ్చాక పడిపరిశ్రమ ఎంతగానో వృద్ధి సాధించిందని వర్గల్ పశువైద్యుడు మోహన్‌లాల్ తెలిపారు. గురువారం మండలంలోని అవుసులోనిపల్లిలో పశుసంవర్ధకశాఖ, పశుగణాభివృద్ధి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పాడి పరిశ్రమను వృద్ధిలోకి తేవడంలో గోపాలమిత్ర సభ్యుల చొరవ ప్రశంసనీయమని కొనియాడారు. అనంతరం గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గోపాలమిత్ర సూపర్‌వైజర్లు భాస్కర్‌గౌడ్, సురేశ్, ఆంజనేయులు, జిల్లా బాధ్యులు సింగంరాజుయాదవ్, సర్పంచ్ కరుణాకర్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక

కోహెడ, జనవరి 25: మండలంలోని తంగల్లపల్లి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న సూర హర్షిని 67వ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపికైంది. ఇటీవల వరంగల్‌లో జరిగిన రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబర్చింది. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 1 వరకు ఛత్తీస్‌గఢ్‌లో జరిగే జాతీయ స్థాయిపోటీల్లో పాల్గొననుంది.

జాతీయ యోగా పోటీలకు విద్యార్థులు

గజ్వేల్, జనవరి 25: ఖేలో ఇండియా సౌత్ జోన్ జాతీయ యోగా పోటీలకు ఆర్ అండ్ఆర్ కాలనీలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం.అంకిత, ఎన్.వైష్ణవి ఎంపికైనట్లు పీఈటీ గోవర్ధన్ తెలిపారు. ఈనెల 27, 28 తేదీల్లో తమిళనాడులోని దిండుగల్ పీఎస్ఎన్ఏ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే పోటీల్లో విద్యార్థినులు పాల్గొంటారని తెలిపారు.

రోగులకు పండ్లు పంపిణీ

హుస్నాబాద్‌టౌన్, జనవరి 25: శ్రీశివసన్నిధి సేవా సంఘం ఆధ్వర్యంలో పదేండ్లుగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని సంఘం అధ్యక్షుడు దూడం నాగభూషణం అన్నారు. శ్రీశివసన్నిధి సేవా సంఘం పదేండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా గురువారం హుస్నాబాద్ సర్కారు దవాఖానలో పండ్లు పంపిణీ చేశారు.

ప్రకటన

ఇందుమూలముగా సమస్త ప్రజలకు తెలియపరచడము ఏమనగా శ్రీ అక్క ఎల్లారెడ్డి తండ్రి చంద్రారెడ్డి, నివాసం సిద్దిపేట గారికి రిజిస్టర్ విక్రయ దస్తావేజు నం. 1142/2021 S.R.O. సిద్దిపేట ద్వారా సంక్రమించిన సిద్దిపేట పట్టణము (పాత గ్రా. పం. ప్రశాంత్ నగర్)లోగల సర్వే నం. 1306లోగల ప్లాటు నం. 68 విస్తీర్ణం 150 చ.గ.లు గల ఆస్తిపై ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకులో హౌసింగ్‌లోన్ మంజూరి కొరకు దరఖాస్తు చేసుకున్నారు. కానీ అక్క ఎల్లారెడ్డిగారు సదరు ఆస్తి యొక్క ఒరిజినల్ లింకు డాక్యుమెంటు నం.లు 1337/1997, 3125/2000, 4254/2001 మరియు 176/2003 గలవి పోయినట్లుగా తెలియజేసినారు. కావున పై ఆస్తిపై గానీ, ఒరిజినల్ లింకు దస్తావేజుల విషయంలో గానీ ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న సంబంధిత ఒరిజినల్ ఆధారాలతో (7) దినములలోగా నా కార్యాలయంలో సంప్రదించగలరు. గడువు తర్వాత నా క్లయింటు బ్యాంకు సంబంధిత డాక్యుమెంట్ యొక్క నకలు కాపీలతో శ్రీ అక్క ఎల్లారెడ్డి గారికి లోన్ మంజూరు చేయుదురు. తదుపరి ఎవరి ఆక్షేపణలు చెల్లనేరవు.

సం/- కె. సాయి నారాయణ
అడ్వకేట్,
సిద్దిపేట, సెల్: 98483 19114

విద్యార్థినీ, విద్యార్థుల తల్లిదండ్రులకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు
75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు
MERIDIAN HIGH SCHOOL
CBSE & STATE SYLLABUS - SIDDIP